# రసవత్తర రాజకీయం





మహేశ్వరంలో జరిగిన కుల సంఘాల ఆత్మగౌరవ సభలో మంత్రులు సబితాఇంద్రారెడ్డి, సత్యవతిరాథోడ్, ఎంపీ రంజిత్‌రెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న ముదిరాజ్ కుల సంఘం నాయకులు

# సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష

- అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలు
- మహేశ్వరంలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం
- పాల్గొన్న మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్

మహేశ్వరం, సెప్టెంబర్ 30 : రైతు బంధు, రైతు భీమాతో సీఎం కేసీఆర్ అన్నదాతల గుండెల్లో గూడు కట్టుకున్నారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి సీఎం కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని చెప్పారు. అన్ని కులాలకు ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తున్నామన్నారు. శనివారం మహేశ్వరం మండల కేంద్రంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ రంజిత్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డితో కలిసి రూ. 69 లక్షలతో మార్కెట్ షెడ్డు , రూ. 4.20 లక్షలతో గిరి జన వసతి గృహం, రూ. 5 కోట్లతో నిర్మించిన సంక్షేమ బాలుర పాఠ శాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. అనంతరం సేవా లాల్ దేవాలయం, కుల సంఘాలకు ఆత్మ గౌరవ భవనాలకు శంకు స్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధిలో దూసుకుపోతున్నదన్నారు. మహేశ్వరం నియోజక వర్గానికి మంత్రి సత్యవతి రాథోడ్ విద్యాలయాలకు రూ. 20 కోట్లు మంజూరు చేశారని చెప్పారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో నియోజక వర్గానికి అభివృద్ధిలో బాటలు వేస్తున్నామన్నారు. కుల సంఘాలకు స్థలాలను ఎంపిక చేయడంలో స్థానికుల పాత్ర ఎంతో గొప్పదని అన్నారు. సీఎం కేసీఆర్ స్ఫూర్తితో నియోజక వర్గంలో 24 కులాలకు ఆత్మగౌరవ భవనాలను నిర్మించి ఇస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో రూ. 15 కోట్లతో ఆత్మగౌరవ భవనాలను నిర్మిస్తున్నామని వెల్లడించారు. నియోజకవర్గంలో అర్హులైన పేదలకు 75 గజాల స్థలాలను కేటాయిస్తామన్నారు. మన్‌సాన్‌పల్లిలో 5 ఎకరాల్లో పేదలకు ఇండ్ల పట్టాలను అందజేస్తున్నామని వెల్లడించారు. సొంత ఇంటి జాగ ఉన్న వారికి గృహలక్ష్మి పథకం కింద రూ. 3 లక్షలను అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఆడబిడ్డ వివాహాలకు రూ. 1 లక్షను అందజేసి ఇంటి పెద్ద దిక్కుగా వారి కుటుంబాలకు అండగా నిలుస్తున్నామన్నారు. అనంతరం ఉప్పుగడ్డతండా, కొత్తతండా, గంగారం తండా, దిలావర్‌గూడ, ఎన్‌డీతండాలకు చెందిన పేదలకు ఇండ్ల పట్టాలను మంత్రి సత్యవతి రాథోడ్‌తో కలిసి ఆమె పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు కార్తీక్‌రెడ్డి, ఎంపీపీ సునీతా ఆంధ్యానాయక్, సహకార బ్యాంక్ చైర్మన్ మంచె పాండు యాదవ్, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురసాని సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఆనందం, తహసీల్దార్ మహమూద్ అలీ, నియోజక వర్గం బీసీ సెల్ అధ్యక్షుడు మల్లేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కుల వృత్తులకు ఆదరణ

- మంత్రి సత్యవతి రాథోడ్



ఒకే రోజు 9 కుల సంఘాలకు ఆత్మగౌరవ భవనాలకు శంకుస్థాపన చేయడం చాలా సంతోషంగా ఉన్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతనే సేవాలాల్ జయంతి అధికారికంగా నిర్వహించడం చాలా గర్వకారణం. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఏనాడూ గిరిజనులను పట్టించుకున్న పాపాన పోలేదు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో కుల వృత్తులకు ఆదరణ లభిస్తున్నది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వెయ్యికి పైగా గురుకులాల్లో 7 లక్షల మంది విద్యనభ్యస్తున్నారు. ఎరుకల కుల సంక్షేమానికి కృషి చేస్తాం. నగరం నడిబొడ్డున రూ. 5 కోట్లతో ఎరుకల భవనం నిర్మించబోతున్నాం. ఎరుకల సంక్షేమం కోసం రూ. 62 కోట్లతో ఎంపవర్‌మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టాం.

## కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలకు వారంటీ లేదు

- ఎంపీ రంజిత్‌రెడ్డి

తెలంగాణలో కాంగ్రెస్ చెప్పిన ఆరు గ్యారెంటీలకు వారంటీ లేదు. తెలంగాణను చూసి కేంద్రం మన రాష్ట్ర పథకాలను కాఫీ కొడుతున్నది. రాష్ట్రంలో రాబోయేది మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అన్ని కులాలకు సముచిత స్థానం లభిస్తుంది. మహిళా రిజర్వేషన్లతో పాటు, బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలి. ఇతర రాష్ట్రాలు తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటున్నాయి. ప్రపంచమంతా తెలంగాణ వైపు చూస్తున్నది. సీఎం కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అయ్యే వరకు కాలికి చెప్పులు లేకుండా మంత్రి సత్యవతి రాథోడ్ తిరుగుతున్నారు. మహేశ్వరం నియోజక వర్గానికి ఎనలేని సేవలను అందిస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డిని భారీ మెజార్టీతో ప్రజలు గెలిపించాలి.



మైనార్టీ మహిళలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

# 300 మందికి కుట్టుమిషన్ల పంపిణీ

- మేలు చేసే ప్రభుత్వానికి అండగా ఉండాలి
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

బేగంపేట్, సెప్టెంబర్ 30: ప్రజలకు మేలు చేసే ప్రభుత్వానికి అండగా ఉండి.. ఆశీర్వదిస్తే మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని ప్రజలకు మరింత మేలు జరుగుతుందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శనివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో ముస్లిం మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో 300 మంది ముస్లిం మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్లు, 80 మంది ముస్లిం మైనార్టీ మహిళలకు లక్ష రూపాయల చొప్పున ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ... ముస్లిం మైనార్టీల సంక్షేమం అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నదని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాతే క్రిస్మస్, రంజాన్ వంటి గొప్ప గొప్ప పండుగలను ప్రభుత్వ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంతే కాకుండా పేదలు కూడా పండుగలను గొప్పగా సంతోషంగా జరుపుకోవాలనే ఉద్దేశంతో నూతన దుస్తులతో కూడిన గిఫ్ట్ ప్యాక్‌లను అందిస్తున్న విషయాలను గుర్తు చేశారు. అదే విధంగా పేదింటి ఆడపచుల పెండ్లికి దేశంలో ఎక్కడా లేని విధంగా షాదీ ముబారక్ కింద ఆర్థిక సహాయం అందిస్తున్నట్టు తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించే శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బస్తీలోని కమ్యూనిటీ హాళ్లలో మరిన్ని శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమ కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం అమలు చేసే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ కార్పొరేటర్ జిల్లా అధికారి ఎలియాస్ అహ్మద్, కార్పొరేటర్లు కొలన్ లక్ష్మి, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, రూప, అరుణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మూడో విడతలో మరో 36,884 మందికి..

- పేదలకు సకల సౌకర్యాలతో 'డబుల్' ఇండ్లు
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్
- బేగంపేటలో లబ్ధిదారులతో ఆత్మీయ సమావేశం




ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, సెప్టెంబర్ 30: అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి పేద ,మధ్య తరగతి ప్రజలకు ఉచితంగా అందిస్తున్న దేశంలోనే ఏకైక రాష్ట్రం తెలంగాణ అని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. శనివారం బేగంపేట పాటిగడ్డలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో 3వ విడత ఆన్‌లైన్ డ్రాలో ఎంపికైన డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం 9600 కోట్ల రూపాయల వ్యయంతో లక్ష డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చేపట్టిందని వివరించారు. మొట్ట మొదటగా ఈ కార్యక్రమం సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని ఐడీహెచ్ కాలనీలోనే ప్రారంభమైందన్నారు. కోట్లాది రూపాయల విలువైన స్థలాల్లో డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు. ప్రభుత్వం నిర్మించిన ఇండ్లను ఎంతో పారదర్శకంగా రాజకీయ జోక్యం లేకుండా అందిస్తున్నట్టు వివరించారు. మొదటి విడతలో 11,700 మందికి, రెండో విడతలో 13200 మందికి ఇండ్లను పంపిణీ చేశామన్నారు. మూడో విడతలో నిర్వహించిన డ్రాలో 36,884 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. వీరికి అక్టోబర్, 2,5 తేదీల్లో ఇండ్లను పంపిణీ చేయనున్నట్టు వెల్లడించారు. గత ప్రభుత్వాలు వివిధ పథకాల పేరుతో పేదల కోసం ఇండ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ కేవలం 30 శాతం మాత్రమే ఆర్థిక సహాయం అందించేదని, ఆ ఇండ్లు కూడా ఎంతో ఇరుకుగా ఉండేవని గుర్తుచేశారు. పేద ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ పేదలకు ఉచితంగా ఇండ్లను నిర్మించి ఇవ్వడంతో పాటు పేదింటి ఆడపడుచు పెండ్లికి ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నారని చెప్పారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని లబ్ధిదారులకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుండిగల్, డి పోచంపల్లి, నిజాంపేటల్లో అక్టోబర్ 2 5న ఇండ్లను కేటాయిస్తామన్నారు. ఈ సమావేశంలో తలసాని సాయికిరణ్‌యాదవ్, కార్పొరేటర్లు మహేశ్వరి, లక్ష్మి, హేమలతా, మాజీ కార్పొరేటర్లు తరుణి, అరుణగౌడ్, రూప తదితరులు పాల్గొన్నారు.

# అప్పుడు ఒట్టేసి.. ఇప్పుడు మొహం చాటేసి..

**'సీటుకు నోటు'పై రేవంత్‌రెడ్డి ద్వంద్వ వైఖరి**



- ఈటల ఆరోపణలు చేసినప్పుడు అడగకుండానే అమ్మవారిపై ఒట్టు
- మహేశ్వరం టికెట్ వ్యవహారంలో మాత్రం మొహం చాటేసిన పీసీసీ అధ్యక్షుడు
- డబ్బులు ఇవ్వలేదని నేను ఒట్టేస్తాను: బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత
- రేవంత్ సహా నలుగురం ఒట్టేద్దాం బహిష్కృత నేత మనోహర్‌రెడ్డి

సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ):'మహేశ్వరం కాంగ్రెస్ టికెట్‌కు ఐదెకరాలు... రూ.10 కోట్లు' అంశం ఆ పార్టీ అధిష్ఠానాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. నిజాయతీ నిరూపించుకోవాల్సిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ముఖం చాటేస్తుండటం ఆ పార్టీ శ్రేణుల్లోనూ అనుమానాలకు తావిస్తున్నది. రాష్ట్రంలోని అనేక నియోజకవర్గాల్లో కాంగ్రెస్ టికెట్ల కోసం భూములు, కోట్లాది రూపాయలు చేతులు మారుతున్నాయనే వివరాలు ఒక్కొక్కటీగా బయటికొస్తుండటం ఆ పార్టీ నేతల్లో కలకలం సృష్టిస్తున్నది. గతంలో మునుగోడు ఉప ఎన్నిక జరిగిన సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఏకంగా రూ.25 కోట్లు తీసుకున్నాడంటూ రేవంత్‌ను తూర్పారబట్టారు. దీంతో రేవంత్‌రెడ్డి చార్మినార్ వద్ద ఉన్న భాగ్యలక్ష్మి దేవాలయానికి వెళ్లి నానా హంగామా చేశారు. తాను రూ.25 కోట్లు తీసుకోలేదని అమ్మవారి ముందు ప్రమాణం చేశారు. ఈ క్రమంలో గత కొన్నిరోజులుగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ కోసం 'ఐదెకరాలు, రూ.10 కోట్లు' చేతులు మారాయనే ప్రచారం విస్తృతంగా జరుగుతున్న విషయం తెలిసిందే. డీసీసీ అధ్యక్షుడి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లోనే నియోజకవర్గ నాయకుడు, మహేశ్వరం కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న కొత్త మనోహర్‌రెడ్డి ఈ సంచలన ఆరోపణ చేశారు. చిగురింత నర్సింహారెడ్డి స్వయంగా తాను రేవంత్‌కు భూమి, డబ్బులిచ్చినట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని కుండబద్దలు కొట్టారు. దీంతో ఉలిక్కిపడిన కాంగ్రెస్ హైకమాండ్.. నష్ట నివారణ చర్యల్లో భాగంగా మనోహర్‌రెడ్డిని సస్పెండ్ చేసింది. దీంతో గతంలో మాదిరిగా రేవంత్‌రెడ్డి భాగ్యలక్ష్మి అమ్మ వారి ముందు ప్రమాణం చేసి, తన నిజాయతీ నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. కానీ రేవంత్ మాత్రం ఈ ఆరోపణలపై స్పందించకపోగా... ఆరోపణ చేసిన మనోహర్‌రెడ్డిని ఆగమేఘాల మీద పార్టీ నుంచి సస్పెండ్ చేయించడం పలు అనుమానాలకు తావిచ్చింది. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు వీహెచ్ ఢిల్లీలో ఇదే అంశంపై వాకబు చేసినట్లు మనోహర్‌రెడ్డి గతంలోనే వెల్లడించారు. అంటే పార్టీ సీనియర్ నాయకుల్లోనూ ఇవే అనుమానాలు ఉన్నాయని అర్థమవుతున్నది. అయినా... రేవంత్ మాత్రం దీనిపై స్పందించకపోవడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## సీటుకు నోటు వ్యవహారంలో..

సీటుకు నోటు వ్యవహారంలో భాగ్యలక్ష్మి దేవాలయం వద్ద నిజాయతీని నిరూపించుకోవాలని కొత్త మనోహర్‌రెడ్డి, రేవంత్‌రెడ్డికి సవాల్ విసరగా... డబ్బులు ఇచ్చారని ఆరోపణలు ఎదుర్కొంటున్న చిగురింత నర్సింహారెడ్డి సతీమణి, బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత శనివారం ప్రెస్‌మీట్ నిర్వహించడంతో వ్యవహారం మరో మలుపు తిరిగింది. రేవంత్‌పై వస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ ప్రెస్‌మీట్ నిర్వహిద్దామంటూ తాను డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డితో పాటు టికెట్ ఆశిస్తున్న కీలక నాయకులకు ఫోన్ చేసి కోరానని, కానీ ఆయన మాత్రం అందుకు నిరాకరించినట్లు ఆమె స్వయంగా వెల్లడించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. టీపీసీసీ అధ్యక్షుడికి టికెట్ కోసం డబ్బులిచ్చిన ఆరోపణలను ఖండించేందుకు డీసీసీ అధ్యక్షుడితో పాటు ఇతర కీలక నేతలు ఆమెతో కలిసి ప్రెస్‌మీట్‌లో పాల్గొనేందుకు సుముఖత వ్యక్తం చేయకపోవడం వెనుక ఆంతర్యమేమిటనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

## ప్రమాణం చేయడానికి ఎక్కడైనా సిద్ధమే

- కొత్త మనోహర్‌రెడ్డి

బడంగ్‌పేట మేయర్ పారిజాత నర్సింహారెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించిన వెంటనే బహిష్కృత నేత మనోహర్‌రెడ్డి కూడా ప్రెస్ మీట్ నిర్వహించడంతో కాంగ్రెస్‌లో 'సీటుకు నోటు' వ్యవహారం మరింత వేడెక్కినట్లయింది. భాగ్యలక్ష్మి ఆలయం కాకుండా మహేశ్వరంలోని శివగంగ ఆలయం వద్ద ప్రమాణం చేయడానికి రావాలంటూ పారిజాత, కొత్త మనోహర్‌రెడ్డిని డిమాండ్ చేయగా... తాను సిద్ధమేనని కొత్త మనోహర్‌రెడ్డి ప్రకటించారు. కాకపోతే... పారిజాతతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఆమె భర్త నర్సింహారెడ్డి కూడా వస్తే నలుగురం కలిసి ప్రమాణం చేద్దామంటూ ప్రతి సవాల్ విసిరారు. ముఖ్యంగా డబ్బులు ఇచ్చిన వారితో పాటు తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రేవంత్‌రెడ్డి కూడా వస్తే రాష్ట్ర ప్రజలకు స్పష్టత ఇచ్చినట్లవుతుందని, రేవంత్‌రెడ్డి కూడా తన నిజాయతీని నిరూపించుకోవచ్చని మనోహర్‌రెడ్డి స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం శివగంగ ఆలయం వద్ద ఏం జరుగుతుందనేది ఉత్కంఠ రేపుతున్నది.

# నేను మీ బిడ్డను.. ఆశీర్వదించండి

- కంటోన్మెంట్‌లో పాదయాత్రకు శ్రీకారం చుట్టిన లాస్యనందిత
- బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్న స్థానికులు



పాదయాత్రలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత

కంటోన్మెంట్, సెప్టెంబర్ 30: 'నేను పేదింటి బిడ్డను... సీఎం కేసీఆర్ దీవెనలతో నిరంతరం ప్రజాసేవే ధ్యేయంగా నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా మీ చెల్లిగా, అక్కగా, మీ బిడ్డగా.. మీ ఆశీర్వాదం కోసం వస్తున్నా...అంటూ కంటోన్మెంట్ బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందిత పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల పాదయాత్రను శనివారం బోర్డు పరిధిలోని ఆరో వార్డు నందమూరినగర్‌లో బోర్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్, విద్యావతిలతో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి లాస్యనందిత ప్రారంభించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రజల ముందుకు వస్తున్న తనను భారీ మెజార్టీతో గెలిపించాలని విన్నవించారు. దివంగత ఎమ్మెల్యే సాయన్నలాగే ప్రజలందరికీ అనునిత్యం అందుబాటులో ఉంటానని లాస్యనందిత తెలిపారు. కరపత్రాల ద్వారా కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆసరా పెన్షన్లు, ఇంటింటికీ మంచినీళ్లు, కరెంటు సరఫరా, పారిశుధ్య నిర్వహణ ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి లాస్యనందితకు స్థానికుల నుంచి అపూర్వ స్పందన లభించింది. జనమంతా బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. సంక్షేమ పథకాలు అందిస్తున్న కేసీఆర్ సర్కారుకే అండగా ఉంటామని స్పష్టం చేశారు. జై కేసీఆర్, జయహో బీఆర్ఎస్ అంటూ నినదించారు.




బోయిన్‌పల్లిలో మంత్రి మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న యువకులు

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనచూసి యువత బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నదని మంత్రి మల్లారెడ్డి అన్నారు. శనివారం బోయిన్‌పల్లిలో అల్వాల్ సర్కిల్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులకు కండువా కప్పి బీఆర్ఎస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ మల్కాజిగిరి నియోజకవర్గంలో మారుతున్న రాజకీయ పరిస్థితులను గమనిస్తున్న కాంగ్రెస్ నాయకులు.. ఆ పార్టీని వదిలి పెట్టి బయటకు రావాల్సిన పరిస్థితులు వచ్చాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ యువత ఉపాధి కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్‌ల ద్వారా ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రమాకాంత్‌రెడ్డి, మధుసుదన్‌రెడ్డి, సంతోష్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– మల్కాజిగిరి, సెప్టెంబర్ 30

## బీఆర్ఎస్‌లో చేరికలు..

అంబర్‌పేట, సెప్టెంబర్ 30: అంబర్‌పేట డివిజన్ బీజేవైఎం నాయకుడు డి.రాజేశ్, గంభీరావు పేట గంగపుత్ర సంఘం అధ్యక్షుడు యాదయ్య శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



రాజేశ్, యాదయ్యకు పార్టీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్